క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ఆంజనేయునికి సింధూరాలంకరణ



ముత్తుకూరు : ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం వాయుపుత్రుడు సింధూర అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాల తోరణాలతో శోభాయమానంగా అలంకరించిన ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శాలివాహన సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది.

మర్యాదపూర్వకంగా..



చంద్రబాబుతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మైపాడు గేట్ సెంటర్‌లో అన్నదానం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌లో అమావాస్యను పురస్కరించుకుని అమ్మ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పితృదేవతల ఆత్మశాంతి కోసం నెల్లూరు అమ్మ భగవాన్ శిష్యులు అక్షజ్ దాసాజీ, సౌజన్య దాసాజీ సూచనల మేరకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత నెల రోజులుగా వేసవిలో దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు రమణయ్య, కిశోర్, భారతి, శిరీష, ధనలక్ష్మి తెలిపారు. అలాగే పేదల కోసం రూ.10కి భోజనం అందించడంతో పాటు స్వచ్ఛభారత్, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించినట్లు వివరించారు.

రామానాయుడికి ఘన నివాళి



నెల్లూరు(బృందావనం) : స్థానిక విజయమహల్ గేట్ సెంటర్ వద్ద సితార కార్యాలయంలో దర్శక నిర్మాత డి.రామానాయుడు జయంతిని గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ కో–ఆర్డినేటర్ కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో రామానాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, జయకుమార్, దువ్వూరు బెనర్జీ, శివకుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తొలకరితో చిగురించిన ఆశలు



సాగులో ఉన్న పచ్చిరొట్ట పైరు(ఫైల్)



ఎడగారు సాగు కోసం వేసిన వరినారు

కొడవలూరు : జిల్లాలో పలుచోట్ల గురువారం తొలకరి జల్లులు పడడంతో వర్షాల రాకపై రైతుల్లో ఆశలు చిగురించాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎడగారు సాగుకు అత్యధిక శాతం మంది రైతులు విరామం ఇచ్చారు. వీరంతా పచ్చిరొట్ట పంటను సాగు చేసుకుని నేలను సారవంతం చేద్దామని భావించినా నీటి లభ్యత లేకపోవడంతో వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రుతు పవనాలు ముందస్తుగా రాష్ట్రంలో అడుగుపెట్టి తొలకరి జల్లులు ఆరంభం కావడంతో వీరిలో ఆశలు రేకెత్తాయి. దీనికితోడు వ్యవసాయ శాఖ యాభై శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తోంది. పచ్చిరొట్ట సాగుకు ఆరంభంలో తడి చేస్తే సరిపోతుంది. తదుపరి ఒకటిన్నర నెల తరువాత దున్నే సమయంలో నీటితడి అవసరమవుతుంది. తొలకరి జల్లులు పడడం, వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఇదే అదనుగా భావించి రైతులు పచ్చిరొట్ట సాగు చేసుకునేందుకు సిద్ధమయ్యారు.

ఖరీఫ్‌పై చిగురించిన ఆశలు

సాధారణంగా జిల్లాలో అక్టోబర్ నుంచి ఖరీఫ్ పంట సాగు చేస్తారు. అయితే వర్షాభావం దృష్ట్యా సోమశిల జలాశయంలో నీటి నిల్వ లేకపోవడంతో ఖరీఫ్‌పై రైతులు ఆశలు వదులుకున్నారు. ఈ నేపథ్యంలోనే రుతు పవనాలు జిల్లాను తాకి తొలకరి జల్లులు పడడం, వర్షాలు పుష్కలంగా కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఖరీఫ్ పంటపై రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాలు బాగా కురిస్తే కాలువలు, చెరువులు నిండి ఖరీఫ్ పంటను సునాయసంగా పూర్తి చేసుకోవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌కు అనూహ్య స్పందన

• వైద్యాధికారి రామకృష్ణ



ఆలూరుపాడులో బీసీజీ వ్యాక్సినేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు : పెద్దల బీసీజీ వ్యాక్సినేషన్‌కు అనూహ్య స్పందన లభిస్తోందని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఆలూరుపాడులో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు టీబీ బారిన పడుతున్న నేపథ్యంలో పెద్దల బీసీజీ వ్యాక్సిన్ కల్పతరువులా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టినా పెద్దలు అనూహ్యంగా సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. 18 ఏళ్లు నిండని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వ్యాక్సిన్ వేయించుకోరాదన్నారు. క్షయ వ్యాధికి మందులు వాడుతున్న వారు కూడా వ్యాక్సిన్ వేయించుకోవద్దని సూచించారు. రక్తదానం చేసిన వారు మూడు నెలలు వరకు, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకుని మందులు వాడుతున్న వారు ఎట్టి పరిస్థితుల్లో బీసీజీ వేయించుకోవద్దని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఏ వెంకట్రావు, ఏఎన్‌ఎం నదియ, ఆశా కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

తిక్కవరప్పాడులో మొక్కల పంపిణీ



మహిళలకు మొక్కలను పంపిణీ చేస్తున్న సుపోషణ్ ప్రాజెక్ట్ సభ్యులు

వెంకటాచలం : అదాని ఫౌండేషన్, అదాని విల్మార్ ఆధ్వర్యంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సహకారంతో మండలంలోని తిక్కవరప్పాడులో గురువారం మొక్కలను పంపిణీ చేశారు. నిమ్మ, బొప్పాయి, మునగలతో పాటుగా 26 రకాల కూరగాయల విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారిణి కొంగి మాతమ్మ మాట్లాడుతూ ఇంటి వద్దనే కూరగాయలను పండించుకుంటే నాణ్యమైన ఆహారం తీసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించేందుకు ప్రతిఒక్కరికీ కూరగాయల విత్తనాలతో పాటు, మొక్కలు పంపిణీ చేసి వాటి ఉపయోగాలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సభ్యులు శోభ, కృష్ణవేణి, అరుణ, రేవతి, సుమతి, చందన, వనిత, భూమిక తదితరులు పాల్గొన్నారు.

• నేత్రపర్వం.. కల్యాణం



తెప్పపై విహరిస్తున్న ఆది దంపతులు



మల్లికార్జున సమేత కామాక్షితాయి కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఆది దంపతులకు విశేషాలంకరణ చేసి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంపై కొలువుదీర్చారు. అనంతరం అర్చకుల వేదపారాయణం, భక్తజన భగవన్నామ స్మరణల మధ్య సాంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం పెన్నానదిలో తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లు తెప్పపై విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కొడవలూరు : యల్లాయపాళెం గ్రంథాలయంలో బహుమతులతో విద్యార్థులు



కొడవలూరులో ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి

• గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

కొడవలూరు : మండల పరిధిలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రంథాలయాధికారులు చిన్నారులకు ఆటపాటలు నేర్పిస్తూ విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. ఈ క్రమంలో మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు పి.రంగారెడ్డి చేతుల మీదుగా గురువారం బహుమతులు అందజేశారు. గత నెల 15వ తేదీ నుంచి విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, తెలుగు కఠిన పదాలు, చిత్రలేఖనం, నీతి కథలు, నైతిక విలువల పెంపుపై శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడంతో పాటు శిబిరానికి హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం రిసోర్స్ పర్సన్ నెల్లూరు శరణ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జె.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చిన శరణ్యను ప్రత్యేకంగా అభినందించారు.

కొడవలూరులో..

వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.రాజేశ్వరి ఇంగ్లిష్ గ్రామర్‌పై విద్యార్థులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంగ్ల భాషపై ప్రాథమిక స్థాయి నుంచే పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్లే శిబిరంలో ఇంగ్లిష్ గ్రామర్‌పై ప్రత్యేక దృష్టి సారించి నేర్పిస్తామన్నారు. వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు బహుమతుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే



చిన్నచెరుకూరు సమీపంలో రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు–కాకుపల్లి మార్గమధ్యలో ఉన్న ఓ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. స్థానిక అంకమ్మ గుడి సమీపంలో ఉన్న కల్వర్టుకు రెండు రక్షణ గోడలు చాలా కాలం క్రితం దెబ్బతిన్నాయి. అందులో ఒకటి పూర్తిగా నేల కూలిపోయింది. అసలే ఇరుకైన కల్వర్టు.. అందులోనూ రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాలు ప్రమాదకర స్థితిలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్త వహించినా వాహనాలు పక్కనే ఉన్న లోతైన కాలువలోకి పడిపోవాల్సిందే. దీంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు వెంటనే రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

విద్యార్థులకు అభినందన



సన్మానం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోవూరు : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అపస్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమం పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఎంఈఓలు దిలీప్, పీవీ రత్నం మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమష్టి కృషితోనే మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు వివరించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, అపస్ జిల్లా అధ్యక్షుడు కె.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో జోరు వర్షం



వెంకటాచలం : తిక్కవరప్పాడులో ఈదురు గాలులతో కూడిన వర్షం



మనుబోలు ఆస్పత్రి వెనుక చేరిన వర్షపునీరు



ఇందుకూరుపేట : కొత్తూరు గ్రామంలో దగ్ధమవుతున్న కొబ్బరిచెట్టు

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి, తిక్కవరప్పాడు, కసుమూరు, కంటేపల్లి, అనికేపల్లి, ఇస్కపాళెం, ఈదగాలి తదితర గ్రామాల్లో గురువారం జోరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. మే నెలలో ఎండల వేడిమితో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

మనుబోలులో..

మనుబోలు : మండల పరిధిలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మనుబోలు మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వర్షపాతం నమోదైంది. సాధారణంగా జూన్ రెండో వారంలో రాష్ట్రంలో రుతు పవనాలు ప్రవేశించడంతో వర్షం కురుస్తుంది. అయితే ఈ ఏడాది ముందుగానే తొలకరి పలకరించింది. దీంతో ఇటీవల వరకు తీవ్రమైన ఎండలతో పాటు ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందిపడిన ప్రజలు వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షంతో ఒక్కసారిగా వాతావరణ చల్లబడింది.

పీహెచ్‌సీ చుట్టూ వర్షపునీరు

మనుబోలులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ వర్షపు నీరు చేరింది. ఆస్పత్రిలో కూడా కొన్ని గదులు ఉరుస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్ రోడ్డుకు ఆస్పత్రి బాగా డౌన్‌లో ఉండడంతో చిన్న వర్షానికే నీరంతా ఆస్పత్రి చుట్టూ చేరుతుంది.

కొత్తూరులో పిడుగుపాటు

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు గ్రామంలో పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధమైంది. అక్కడ ప్రజలెవరూ లేకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే మండల పరిధిలో చిన్నపాటి వర్షం కురవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.